క్లుప్తంగా

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

మలికిపురం: మండలంలోని తూర్పుపాలేనికి చెందిన మైనర్ బాలిక అదృశ్యం ఘటనపై గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నెల 2న ఇంటి నుంచి అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పి.సురేష్ మీడియాకు చెప్పారు.

జనవరి 10న ఉత్తర ద్వార దర్శనం

మామిడికుదురు: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జనవరి 10న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు గురువారం తెలిపారు. 10వ తేదీ మార్గశిర శుద్ధ ఏకాదశి శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం (ఉత్తర ద్వార దర్శనం) భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఉత్తర ద్వారం వద్ద శ్రీ, భూ సమేత బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామి వారు ఉత్తర ద్వారం వద్ద దర్శనం ఇస్తారన్నారు.

శాంతి సమాధానాలతో జీవించాలి



ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: పాపులను రక్షించేందుకే క్రీస్తు సూక్తులు ఆచరిస్తూ శాంతి సమాధానాలతో జీవించాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ డానియేల్ పాల్ సూచించారు. అంబాజీపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మాచవరం శివారు పోతాయిలంక త్రియేక ప్రార్థన మందిరంలో జిల్లా జనరల్ సెక్రటరీ ధనరాజు చికిలే అధ్యక్షతన గురువారం ఐక్య క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాగాబత్తుల సుబ్బారావు, మైపాల తాతాజీ, ఫెలోషిప్ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు ధ్వంసం



కారు ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం, ధ్వంసమైన కారు ముందు భాగం

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గురువారం పెళ్లి బృందాన్ని దింపి వస్తున్న కారు 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. డ్రైవర్ కాకినాడలో కారుని అద్దెకు తీసుకుని అమలాపురంలో పెళ్లి బృందాన్ని దింపి ముక్తేశ్వరం మీదుగా అయినవిల్లి లంక తన స్వగృహానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు బెలూన్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ఆ సమయంలో ఆ కారులో అతను ఒక్కడే ఉన్నాడు. చుట్టు పక్కల కూడా ఎవరూ లేరు. కారు బలంగా ఢీకొనడంతో విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగింది. కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అయ్యింది.

నిత్యాన్నదానానికి రూ.16,116 విరాళం



దాత గోపాలకృష్ణ యాదవ్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అయినవిల్లికి చెందిన వంట్రపాటి బాలగోపాల కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులతో కలసి గురువారం రూ.16,116 విరాళం అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, అర్చక సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

భోజనం ప్లేట్లు అందజేత

ఆలమూరు: మండలంలోని చింతలూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు దాత సహకారంతో గురువారం భోజనం ప్లేట్లు పంపిణీ జరిగింది. విజయవాడకి చెందిన సాధినేని రాజేశ్వరి తన పెద్ద కుమారుడు నూతన వెంకట సాయి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు సమకూర్చిన భోజన ప్లేట్లను ఎంఈవో భమిడిపాటి అప్పాజీకి అందజేశారు. దాతలను ఎంఈఓ అప్పాజీ అభినందించారు. ప్రధానోపాధ్యాయులు వుడతా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు వాసా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రీచార్జి చేస్తేనే.. విద్యుత్ సరఫరా

- ముమ్మరంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాల్లో బిగింపు పూర్తి
- త్వరలో గృహాలకు వర్తింపు
- వ్యతిరేకిస్తున్న వినియోగదారులు

అంబాజీపేట: ఎన్నికల ముందు కూటమి నాయకులు స్మార్ట్ మీటర్ల (ప్రీ పెయిడ్)ను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై దుష్ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అత్యంత వేగంగా అమలు చేస్తోంది. నియోజకవర్గంలోని అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో లక్షకుపైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను ప్రారంభించడంతో ప్రభుత్వ కార్యాలయాలు పరిశ్రమలతో పాటు గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. పూర్తిగా వంద శాతం బిగించిన తరువాత రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. లేకుంటే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార దుకాణాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు దుకాణలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.



అంబాజీపేటలో వ్యాపార దుకాణంలో అమర్చిన స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్

> **స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి**
>
> 
>
> గృహావసరాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం. బిల్లులు ఇస్తే 15 రోజులు గడువు ఉంటుంది. డబ్బులున్నప్పుడు పేదలు, మధ్యతరగతి ప్రజలు బిల్లు చెల్లిస్తారు. ఇప్పుడు ముందే రీచార్జి చేసుకోవాలంటే పేదలకు భారమే. అర్ధరాత్రి రీచార్జి అయిపోతే తెల్లవారే వరకు కరెంటు లేకుండా ఉండాల్సి వస్తుంది. గృహ వినియోగదారులకు స్మార్ట్ నిలుపుదల చేయాలి.
>
> – కొర్లపాటి కోటబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు, అంబాజీపేట

ఇప్పటి వరకు బిగించిన మీటర్లలో ఎలాంటి సిమ్ కార్డును అమర్చలేదు. దశలవారీగా ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం విద్యుత్ బిల్లు వాడిన యూనిట్లు శ్లాబుల ప్రకారం వస్తుందని. రేపు రీచార్జి చేసుకోవడం ద్వారా శ్లాబులు ఉంటాయా లేదా అనే అనుమానాలున్నాయి. విద్యుత్ యూనిట్ రేటు ఎంత ఉంటుందనే సందేహం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈనెల వినియోగించిన కరెంట్ బిల్లు మరుసటి నెల చెల్లిస్తున్నారు. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుంతో చెల్లించేందుకు సమయం ఉంటుంది. ప్రీపెయిడ్ బిల్లు విద్యుత్ మీటర్లు అమర్చితే ఈ పరిస్థితి ఉండదు. ముందుగానే సొమ్ము చెల్లించి రీచార్జి చేయాల్సి ఉంటుంది.

రోడ్డున పడనున్న మీటర్ రీడర్లు

ప్రీపెయిడ్ మీటరు రీడర్లు రోడ్డున పడే ప్రమాదం నెలకొంది. మీటరు రీడర్లు ప్రతి నెలా ఇంటికి వెళ్లి రీడింగ్ తీసి వినియోగదారులకు విద్యుత్ బిల్లులు అందిస్తున్నారు. దీనికి వారికి ఒక సర్వీసుకు సుమారు రూ.2.50 చెల్లిస్తున్నారు. నెలలో సగం రోజులు మీటరు రీడింగ్‌లు తీసుకుంటూ మిగిలిన రోజులు ఏదో ఒక పనికి వెళ్లి తమ జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రీపెయిడ్ మీటర్ల విధానం అమల్లోకి వస్తే వారి పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారనుంది. వారు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

బస్సు గ్యారేజ్ సందర్శన

అయినవిల్లి: అమలాపురంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 'బస్సు గ్యారేజ్‌ను ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న 95 మంది విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఓ బృందం వెళ్లారు. డిపో మేనేజర్ కె.సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో మెకానిక్ గారేజ్ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెకానిక్ విద్యను అభ్యసించడం వలన స్వావలంబన, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని ఆయన వివరించారు. ఈ లోకోమోటివ్ కోర్సులు అభ్యసించడానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ లోకోమోటివ్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఆయన పలువురు మెకానిక్ ట్రైనర్లు ఉన్నారు.

డ్రెయిన్ ఆక్రమణ

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం, తూర్పుపాలెం పరిధిలో గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణకు గురైనట్టు రెవెన్యూ శాఖ గుర్తించింది. ఏడు రొయ్యల చెరువులు డ్రెయిన్ ఆక్రమణకు పాల్పడినట్టు తెలిపింది. ఇందుకు సంబంధించి ఆరుగురు ఆక్వా సాగు రైతులను ఆక్రమణ దారులుగా అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆక్రమణదారుల చెరువులకు తక్షణం విద్యుత్ కనెక్షన్లు, ఆక్రమిత చెరువులు తొలగించి డ్రెయిన్ ప్రవాహం యథావిధిగా ఉండేటట్టు చూడాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, విద్యుత్, డ్రెయిన్ అధికారులను ఆదేశించారు.

అక్రమ మద్యం సీజ్

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇసుకపాటి సాహెల్‌ను ఆలమూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ కథనం ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో ఆయన ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రాము, సిబ్బందితో కలిసి గురువారం తెల్లవారుజామున తనిఖీ లు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన ఇసుకపాటి సాహెల్ (22)ని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 33 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

మామిడికుదురు: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 177 మంది ఓటర్లకు గాను 171 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 95 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు ప్రధానమైన ఉపాధ్యాయ యూనియన్లు శిబిరాలు ఏర్పాటు చేసి టీచర్స్‌కు స్లిప్పులు అందజేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన పోలింగ్ 93.90 శాతం పూర్తయినట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. మండలంలో 129 మందికి 121 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా సాగినట్లు తహసీల్దార్ తెలిపారు.



కొత్తపేటలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లో 96.28 శాతం..

కొత్తపేట: స్థానిక రెవెన్యూ డివిజన్ పరిధిలోని 7 మండలాల్లో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికల బరిలో గంధం నారాయణరావు, పులుగు దీపక్, కవల నాగేశ్వరరావు, నామన వెంకటలక్ష్మి, బొర్రా గోపీమూర్తి నిలిచారు. ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లకు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్స్‌కు ఓటు హక్కు ఉన్న విషయం తెలిసిందే. ఆ విధంగా కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో పురుషులు 536 మంది, మహిళలు 270 మందితో మొత్తం 806 మంది ఓటర్లుగా ఉన్నారు. మొత్తం 776 (96.28 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఆర్డీవో పి.శ్రీకర్ పర్యవేక్షణలో పోలింగ్ జరిగింది. కొత్తపేట మండలంలో మొత్తం 200 మందికి గాను 197 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 94.95 శాతం పోలింగ్ జరిగినట్టు తహసీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. 119 మంది ఓటర్లకు గాను 113 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆమె వివరించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు స్థానిక తహసీల్దార్, ఏఈఆర్ఓ సీహెచ్ నాగలక్ష్మమ్మ తెలిపారు.

రావులపాలెంలో..

రావులపాలెం: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం రావులపాలెంలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ 53లో ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ బూతులో 170 ఓట్లు ఉండగా 163 ఓట్లు పోలవడంతో 95.88% పోలింగ్ నమోదయ్యింది.

పదవుల భర్తీలో అన్ని వర్గాలకూ ప్రాధాన్యం



పార్టీ పదవులు పొందిన నాయకులతో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అన్ని విభాగాలు, అనుబంధ సంస్థల పదవుల భర్తీలో అన్ని వర్గాలకూ సమాన ప్రాతినిథ్యం ఇస్తున్నట్లు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావు అన్నారు. గురువారం మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజోలు నియోజకవర్గానికి వివిధ విభాగాల కమిటీలు 29 మందిని ఏర్పాటు చేశారు. సభలో ఆయన మాట్లాడుతూ పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేసి వచ్చే ఏ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు పార్టీలోని ప్రతి ఒక్కరి సహకారం ముఖ్యమన్నారు. ఐదు నెల కూటమి పాలనలో చేసిన అభివృద్ధేమిటో ప్రజలు గమనించారని అన్నారు. ఇంత తక్కువ సమయంలో ప్రజలకు తమ దౌర్భాగ్య పాలన తెలియజేసిన ఘనత కూటమిదేనన్నారు. ఇటువంటి సమయంలో ప్రజల తరపున పోరాటం చేయాల్సిన గురుతర బాధ్యత వైఎస్సార్ సీపీపై ఉందన్నారు. కార్యక్రమంలో పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, కొనపరెడ్డి రాంబాబు, కటకంశెట్టి ఆదిత్య, తాడి సహదేవ్, 29 విభాగాలకు సంబంధించిన నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ నేలల పరిరక్షణ దినోత్సవం

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక రైతు సేవా కేంద్రం వద్ద గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ నేలల పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు ఏవో పీవీ నరసింహారావు, రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను పంపిణీ చేశారు. అలాగే వివిధ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద కూడా ప్రపంచ నేలల పరిరక్షణ రోజు ఆ శాఖ సిబ్బంది నిర్వహించారు. రైతు జాన సునీల్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: నేలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులతో పాటు అందరిపై ఉందని ఆత్మ ప్రాజెక్ట్ పీడీ జ్యోతిర్మాయి అన్నారు. పుల్లేటికుర్రులో ప్రకృతి వ్యవసాయ విభాగం వ్యవసాయ క్షేత్రంలో ప్రపంచ నేలల పరిరక్షణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ నేలను నమ్ముకున్న అందరూ కూడా ఆర్థికంగా నిలబడాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేల పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. డాట్ శాస్త్రవేత్త (ఏరువాక) నందకిషోర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్, పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు, ఏఓ సీహెచ్ విజయ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్ట్ అడిషనల్ డీపీఎం ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, నాగవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పుల్లేటికుర్రులో మాట్లాడుతున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి

నేల జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

కొత్తపేట: నేల జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవాన్ని గురువారం సాయంత్రం స్థానిక డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'నేల తల్లిని సజీవంగా ఉంచుదాం.. నేల వైవిధ్యాన్ని కాపాడుకుందా..' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మనిషి ఉనికికి, జీవనానికి మట్టి మూలాధారమన్నారు. మట్టి లేకపోతే ఆహారం లేదు.. ఆహారం లేకపోతే జీవం లేదు.. మట్టి సర్వ జీవులకు ఆధారమని అన్నారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు హేమలత, అధ్యాపకులు ప్రసన్నజ్యోతి, భవాని, సుకృద శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేపీ రాజు

పోషణ్ వాటికకు 23 కేంద్రాల ఎంపిక

మామిడికుదురు: పోషణ్ వాటికలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో ఎనిమిది రకాల ఆకుకూరలు, ఆరు రకాల కూరగాయలు పెంచాల్సి ఉంటుందని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోషణ్ వాటిక పథకం ద్వారా మండల పరిధిలో 23 అంగన్వాడీ కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పథకంలో భాగంగా ఒక్కో కేంద్రంలో ఆకుకూరలు, కూరగాయలు పెంపకానికి రూ.10 వేలు వంతున నిధులు మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం నిర్వాహకులు ఉత్సాహంగా పాల్గొని దీన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బలక్ష్మి, విజయలక్ష్మి, అన్నపూర్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

సేంద్రియ వ్యవసాయంతో ఎంతో మేలు

మామిడికుదురు: సేంద్రియ వ్యవసాయం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి జి.మనోహర్ తెలిపారు. మొగలికుదురు రైతు సేవా కేంద్రంలో పి.గన్నవరం, రాజోలు సబ్ డివిజన్ల వీఏఏలు, బీహెచ్ఏలకు గురువారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రపంచ నేల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి రైతు విధిగా భూసార పరీక్ష చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులు వేసుకోవాలని సూచించారు. కూరగాయల సాగు, కొబ్బరి ప్యాక్ హౌస్‌లకు, కొబ్బరి కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు, నిర్మాణానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఈ సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏఓ బి.మృదుల, రాజోలు ఏఓ వై.మధు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం అధికారి మనోహర్

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



సఖినేటిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సమావేశం

మామిడికుదురు: మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు గురువారం తెలిపారు.

సఖినేటిపల్లి: మండలంలో శుక్రవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకూ ఆయా సచివాలయాలకు సంబంధించిన పంచాయతీల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు గురువారం తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

రాజోలు: గ్రామాల్లో నేటి నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

పి.గన్నవరం: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సు సదస్సులు ప్రారంభిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీపల్లవి తెలిపారు.

అయినవిల్లి: భూ వివాదాలపై ఈ నెల 6 నుంచి 27 తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదం

అయినవిల్లి: విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే మండలంలోని చింతనలంకలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు ఇళ్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయని ఎమ్మార్పీఎస్ జిల్లాఅధ్యక్షులు సవరపు భైరవస్వామి ఆరోపించారు. గురువారం భైరవస్వామి నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ జిల్లా బృందం చింతనలంకలో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. భైరవస్వామి మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఏడు కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారన్నారు. ఇంత జరిగినా విద్యుత్ అధికారులు, ప్రభుత్వం అండగా నిలవాల్సింది పోయి కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. బాధితులను తక్షణం ఆదుకోవాలని, పక్కా ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఉప్పలగుప్తం మండల శాఖ అధ్యక్షుడు సత్తాల దుర్గారావు, టి.కొత్తపల్లి అడవిపేట గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకుల నేతృత్వంలో సేకరించిన విరాళాలతో బాధితులకు ఇనుప బీరువాలు, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వి.కిషోర్‌బాబు మాదిగ, సత్తాల దుర్గారావు మాదిగ, పలివెల రాంబాబు మాదిగ, ముమ్మిడివరపు విక్రమ్ మాదిగ, లంక శ్రీనివాస్ మాదిగ, సవరపు వెంకట మాదిగ, ముమ్మిడివరపు మురళి మాదిగ, ఎస్ శ్రీనివాసరావు మాదిగ, పెందుర్తి సుబ్బారావు మాదిగ తదితరులు ఉన్నారు.



చింతనలంక అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పశువులు ఎదకు వచ్చే విధంగా శ్రద్ధ తీసుకోవాలి

అంబాజీపేట: పశువులు ఎదకు వచ్చేందుకు ఇదే మంచి సమయమని వాటి పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు అన్నారు. పశుసంవర్ధక శాఖ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో గంగలకుర్రులో ఉచిత పశు వైద్య గర్భకోశ వ్యాధుల శిబిరాన్ని పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ కృత్రిమ స్టార్డె సెమెన్ ఉపయోగించి పెయ్యి దూడలు పుట్టే విధంగా వినియోగించుకోవాలన్నారు. పి.గన్నవరం వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ విజయారెడ్డి మాట్లాడుతూ పశువులకు ఎదకు వచ్చే విధంగా ఇంజక్షన్ చేయించుకొని లవణ మిశ్రమాన్ని, మందులను వాడి సరైన సమయంలో ఎదకు వచ్చే విధంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. శిబిరంలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, పశువైద్యాధికారులు చీకట్ల నారాయణమూర్తి, శ్రీనివాస్, దీపిక, మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ సిబ్బంది, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.



గంగలకుర్రులో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు

రెవెన్యూ సదస్సులు వాయిదా

రావులపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లో ఉండడంతో రేపటి నుంచి జరగవలసిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడినట్టు తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు గురువారం తెలిపారు. ఎన్నికల కోడ్ తీసివేసిన అనంతరం తిరిగి రెవెన్యూ సదస్సులు షెడ్యూల్ ప్రకటించి నిర్వహిస్తామన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శ్రీకారం

మలికిపురం: మండంలోని చింతలమోరి గ్రామ సర్పంచ్ డాక్టర్ రాపాక రమేష్‌బాబు గ్రామంలో పోడి తోట గ్రూపులో ఆయన తండ్రి, దివంగత రాపాక కుమార స్వామి జ్ఞాపకార్థంగా నూతన కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు ఆయన సొంత ఖర్చులతో డాక్టర్ రాపాక రమేష్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రూపు ప్రెసిడెంట్ బందెల నారాయణరావు, రాపాక సురేష్, రాపాక ఈశ్వరరావు, రాపాక ప్రభాకరరావు, చవ్వాకుల వెంకటరత్నం, మైనం వెంకటేశ్వరరావు, రాపాక సత్యనారాయణ, రాపాక మహేష్, నల్లి ప్రకాష్, ర్యాలి శ్రీనివాస్, బండారు కృష్ణ, రాపాక సంపత్ కుమార్, గంటా ప్రభాకరరావు, కొల్లాబత్తుల బాబూరావు, కొల్లు గంగాధరరావు, రాపాక రాజు తదితరులు పాల్గొన్నారు.



చింతలమోరిలో సామాజిక భవనానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ రమేష్‌బాబు